# ముందు మాట

ఒక రచన వెనుకున్న రచయితను తెలిపినంత సులభంగా,
రచయితకు సహాయ సౌజన్యాలు అందించిన వారి గురించి
చెప్పడం కష్టమేమో.

ఏమి చేసినా ప్రేమించే అమ్మా నాన్న గారికి, ఏమి చేయకున్నా ప్రేమించే
అర్ధాంగికి, ఏమి అన్నా ప్రేమించే తోబుట్టువులకు, ఏమి అనకున్నా
ప్రేమించే కన్నబిడ్డలకు హృదయపూర్వక కృతజ్ఞతలు!

నా ఛందోబద్ధ ప్రయత్నాలు అమెరికాలో అంకురించడం అనుకోని
ఆశ్చర్యానుభూతి అయితే, దానికి ముఖ్య కారకులు, ప్రేరకులు,
సహాయకులు అయిన శ్రీయుతులు పిల్లలమఱ్ఱి రామకృష్ణ, జెజ్జేల కృష్ణ
మోహన రావు, సుప్రభ గార్లకు సదా కృతజ్ఞున్ని. సూచనలు,
ప్రోత్సాహాలను అందించిన, అందిస్తున్న మిత్రులందరికీ
హృదయపూర్వక కృతజ్ఞతలు.

అప్పుడప్పుడు వ్రాసిన ఈ రచనలను ఒక్క చోట ఈ విధంగా వెబ్సైటు
రూపంలో అందించే అవకాశమిచ్చిన వంశీ గారికి చాలా కృతజ్ఞతలు.

తేనె తీపి కన్న తీయ మామిడి కన్న
జున్ను నేయి కన్న వెన్న కన్న
మధుర మైన తెలుగు మనమెంత గ్రోలినా
చూపు కొత్త సొగసు షుగరు రాదు !

విధేయుడు
- శ్రీనివాస్



PDF created with pdfFactory trial version www.pdffactory.com

ఎన్నో మంచి భావాలను అలా ఒడిసిపట్టి అలవోకగా వ్రాయటం
కొంత మందికే చెల్లుతుంది. అలాంటి వజ్రాలలో శ్రీ నాగులపల్లి శ్రీనివాస్
గారు ఒకరు. ఆయన రాసిన కొన్ని కవితా మాలికలను స్వచ్ఛమయిన
గుచ్ఛంగా మీ ముందుకు తీసుకుని రావటనికి అనుమతి ఇచ్చినందుకు
ఆయనకు అభివాదాలతో

విధేయుడు

వంశీ



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# "భుజ"కంపం

(జనవరి 2001 లో గుజరాత్ లో 'భుజ్ ' అనే ప్రాంతంలో
భూకంపం వచ్చిన సందర్భంలో వ్రాసింది)

పక్షి పడిన వేదనగని
తక్షణమే శ్లోక మిడెను తాపసి యపుడున్
లక్షల "భుజ"జనులార్తికి
తక్షణమే చేయు మయ్య తగు సాయంబున్

ఆనాడు గాంధి మరణము
ఈనాటి ప్రజల మరణము లెంతో తొలిచెన్
ఐనను కంపించక శో
కాన నిలువుము గుజరాతు కడచును కష్టాల్



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# అక్షరం

---------

అక్షరం అందమైన పదం అక్షరం అందలేని పదం
అక్షరం అడగనైన వరం అక్షరం అడుగువేయు కలం
అక్షరం అంతులేని ధనం అక్షరం హద్దులేని బలం
అక్షరం పిలుపుకిచ్చు గళం అక్షరం తలపు తెల్పు నిజం

అక్షరం భాషలిపు లధరించు అక్షరం భావము లభినయించు
అక్షరం భాషలను బతికించు అక్షరం భాషపోయిన మిగులు
అక్షరం పలుకు కిచ్చు జవం అక్షరం పలుకుపోయిన నిలుచు
అక్షరం కొత్త భాషల జేరు అక్షరం కొత్త పలుకుల జేయు

అక్షరం గతచరిత్రకు పునాది అక్షరం నేడురేపటికి వారధి
అక్షరం కాలముతో పారు నది అక్షరం కాలమునే తెల్పగలది

అక్షరం సకలార్థములు జేయు అక్షరం ప్రాణాంతకముగ మారు
అక్షరం శాంతభావముల నిచ్చు అక్షరం ద్వేషములకు కార్చిచ్చు
అక్షరం స్వరమాధురుల పంచు అక్షరం ఆర్ద్రముగ నినదించు
అక్షరం గాలికిచ్చు గరిమ అక్షరం కాగితానికి మహిమ

అక్షరం మార్పులెన్నియొ జేయు అక్షరం తాను మారక మార్చు
అక్షరం అన్ని తెలిపెడు వెలుగు అక్షరం ఎన్నలేనటి జిలుగు

అక్షరాభ్యాసమే చదువు అక్షరారాధన జేయు కళలు
అక్షరార్ణవమే విద్య అక్షరాకృతియే వాక్కు

అక్షరం పదం కాని పదం అక్షరం మనిషికున్న ధనం
అక్షరం అందమైన పదం అక్షరం అందలేని పదం



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# అమ్మ ప్రేమ

----------

సౌఖ్య మొసగు శేషశయ్యనే వీడియు
చెంత నున్న లక్ష్మి చెలిమి వదలి
వెతలు దీర్చు వేల్పు వెతల ననుభవింప
యేల భువికి వచ్చె నేమి కోరి ?

ధర్మ రక్షణముకు ధరణి కేగుదు నేను
నమ్ము మన్న గాని నమ్మ లేను
ఉన్న చోట నుండి యుద్ధరింపగ లేడ
అవతరించు టేల యవని లోన ?

శంఖ చక్ర గధయు శార్ఙ్గము నగలను
కౌస్తుభమ్ము నైన కాదు యనుచు
అన్ని యున్న యతడు అమ్మ ప్రేమను కోరి
తరలి వచ్చె ననుచు తలతు నేను



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# అన్నమయ్య పదములు

-------------------

మనసులోని మాటలై మరపురాని పాటలై
పరవశించు భావమై పరిమళించు నాదమై
తేనెలొలుకు తెలుగునై తేజరిల్లు వెలుగులై
వాక్యమాడు లాస్యమై వాద్య గోష్ఠి శబ్దమై
చెదిరిపోని శిల్పమై చెప్పరాని కల్పనై
గుండెలోని గానమై కొండవాగు గమకమై
పల్లెనుడుల మూటలై తల్లిపాడు జోలలై
పసిపాపల ఊరటై పరమాత్ముని పోరటై
ధైర్యమిచ్చు తంత్రమై దయనుపెంచు మంత్రమై
హాయినిచ్చు తలపులై హాసికెదురు తలుపులై
వీడిపోని మిత్రులై వాడిపోని పువ్వులై
ఎపుడునిల్చు అందమై ఎగిరిపోని గంధమై
ఆరిపోని దీపమై అంతరంగ ధూపమై
అవనినిల్చె ప్రమిదలై అన్నమయ్య పదములై



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# బతుకమ్మ

------------

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో
బతుకు చల్లగ చూడు ఉయ్యాలో

కనుల నిచ్చిన తల్లి ఉయ్యాలో
కనికరంబుగ చూడు ఉయ్యాలో

మనసు నిచ్చిన తల్లి ఉయ్యాలో
మరువకెప్పుడు మమ్ము ఉయ్యాలో

మెదడు నిచ్చిన తల్లి ఉయ్యాలో
చెదలు పట్టక చూడు ఉయ్యాలో

తనువు నిచ్చిన తల్లి ఉయ్యాలో
గుణము చక్కని దిమ్ము ఉయ్యాలో

బతుకు నిచ్చిన తల్లి ఉయ్యాలో
చితికి పోవక చూడు ఉయ్యాలో

కళల నెలవుగ నీవె ఉయ్యాలో
కలలు వెలుగగ నీవె ఉయ్యాలో

బలము పెరుగగ నీవె ఉయ్యాలో
గెలుపు కలుగగ నీవె ఉయ్యాలో



PDF created with pdfFactory trial version www.pdffactory.com

అన్నపూర్ణవు నీవె ఉయ్యాలో
ఆకలెందుకు మాకు ఉయ్యాలో

పల్లె పల్లెకు నీవు ఉయ్యాలో
పచ్చదన మియ్యాలి ఉయ్యాలో

పసుపు కుంకుమ నీకు ఉయ్యాలో
పాడి పంటలు మాకు ఉయ్యాలో

పంటలకు నీరిచ్చి ఉయ్యాలో
కంటి నీరును తుడుపు ఉయ్యాలో

పస్తు లుండెడి రైతు ఉయ్యాలో
మస్తు గుండగ జేయి ఉయ్యాలో

వనరు లిచ్చెడి తల్లి ఉయ్యాలో
వినియోగ శక్తిమ్ము ఉయ్యాలో

పూలతో మొగ్గలతో ఉయ్యాలో
పూజ చేతుము నీకు ఉయ్యాలో

మొగ్గలవి కావవి ఉయ్యాలో
చిగురించు మా ఆశలుయ్యాలో

రంగు రంగుల పూలు ఉయ్యాలో
రక రకాల మనసు లుయ్యాలో



PDF created with pdfFactory trial version www.pdffactory.com

అందరికి శాంతిని ఉయ్యాలో
అందజేయాలమ్మ ఉయ్యాలో

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో
బతుకు చల్లగ చూడు ఉయ్యాలో



PDF created with pdfFactory trial version www.pdffactory.com

## బుద్ధుడు నవ్వుచూ నిలిచెన్

---------------------------

రాజ్యభోగము పీడగలిగిన
రాకుమారుని రాతిజేసి
రాజధానిలో నిలిపివేయగ
చిన్నగా నవ్వెన్ బుద్ధుడు నవ్వుచూ నిలిచెన్

పదవికోసం పాకులాటలు
కీర్తికోసం కీచులాటలు
ఓట్లకోసం ఊగులాటలు
చూడగా నవ్వెన్ బుద్ధుడు నవ్వుచూ నిలిచెన్

ప్రేమపక్షుల సరస శోభలు
ప్రేమపిఫలుల తొలుచు క్షోభలు
ప్రేమతెలియని బుడుత ఎడదలు
చూడగా నవ్వెన్ బుద్ధుడు నవ్వుచూ నిలిచెన్

మమతలేని బతుకు వద్దని
మార్కు రాని ఫలితమొద్దని
మార్గమిది యని చావ గోరుట
చూడగా నవ్వెన్ బుద్ధుడు నవ్వుచూ నిలిచెన్

ముదముతో ఘన పూజ సల్పిన
మురికి నీరే పార జేసిన
ముక్కు మూయక నోరు పిప్పక
చూచుచూ నవ్వెన్ బుద్ధుడు నవ్వుచూ నిలిచెన్



PDF created with pdfFactory trial version www.pdffactory.com

సిదురరాని జనుల వ్యథలు
మేలుకోని వారి పెతలు
కలలు మాత్రము కనెడి కనులు
చూచుచూ నవ్వెన్ బుద్ధుడు నవ్వుచూ సిలిచెన్

మధ్యగోడలు లేని బాటలు
ఎడమ కుడియై కుడియె ఎడమై
కొంపగూల్చెడు రోడ్డు చావులు
చూచుచూ నవ్వెన్ బుద్ధుడు నవ్వుచూ సిలిచెన్

కినుకు చెంది బస్సు కాల్చి
బస్సులేదని కోపమందే
చిత్త వృత్తుల చేతనత్వము
చూచుచూ నవ్వెన్ బుద్ధుడు నవ్వుచూ సిలిచెన్

కలుషితంబగు గాలి నీరును
కడిగివేయుదు మనుచు పల్కుచు
ప్రజల యందే పొగను త్రాగగ
చూచుచూ నవ్వెన్ బుద్ధుడు నవ్వుచూ సిలిచెన్

పంటలెండి బతుకు మండి
వడ్డి తీర్పగ సాయ మందక
"చితి"కి పోయిన కలుగు సాయము
చూడగా నవ్వెన్ బుద్ధుడు నవ్వుచూ సిలిచెన్



PDF created with pdfFactory trial version www.pdffactory.com

విగ్రహాలకు పూజలొద్దని
వివరముగ బోధనలు జేసిన
వేల్పుయని విగ్రహము నిల్పగ
చూచుచూ నవ్వెన్ బుద్ధుడు నవ్వుచూ నిలిచెన్



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# చెలిమి

-------

అరుణోదయ రపి కాంతులు యరుదెంచెడి ఘడియన్
పిరజాజులు నవ శోభలు పెదజల్లెడి క్షణమున్
స్వర మాధురి యెల కోయిల చవులూరగ నొసగన్
చిరునవ్వుగ చిగురింతువు చెలిమై నువు మదిలో

జడివానలు సుడిగాలులు శ్రమపెట్టగ వడిగా
గురి తప్పిన శరమైనటు కొనసాగగ గ్రహముల్
దరిదాపుల పెలుగందని తమమే నెలకొనగా
మెరుపై నవ స్పృహకై నువు మెరిసేవపుడెదలో



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# జన్మ ధన్యం

------------

పదాలెన్ని వున్నా
ముదంబెవ్వి యిచ్చున్
నదుల్ చాల వున్నా
ఇదేమింక దాహం

అశేషస్త్రరాశుల్
స్వశక్తేది యిచ్చున్
సుశాస్త్రాలు వున్నా
ప్రశాంతేది గూర్చున్ ?

తినేదంబలైనా
వనాలందు వున్నా
సునాయాసమౌగా
మనశ్శాంతి యుండన్

సిరాశే మిలేకన్
పరేశాను గాకన్
మరోధ్యాస లేకన్
ఒరుల్మేలు సల్పన్

పిరుల్ వోలె శ్వాసల్
తరుల్ వోలె దేహం
పరంధామము గొల్వన్
మరింకేమి కోర్కెల్



PDF created with pdfFactory trial version www.pdffactory.com

మదిన్ లేచు భావాల్
ఎదన్ మీటు నాదాల్
సదాసొంత మైతే
కదా జన్మ ధన్యం



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# మమతపు విరులు

---------------

తొలకరి చినుకులు దొరలగ ధరలో
జలములు దొరుకగ జనులకు వడిగా
పొలములు గళములు పులకుచు మెలగన్
కలతలు కరువులు కనుమరుగవగా

నిలువగ సమతయె నిజముగ మతమై
తలపుల యలజడి తరుగగ మదిలో
వెలయగ మమతపు విరులవి యెపుడున్
అల తిరుమల విభు ననయము గొలుతున్



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# ప్రేమ

------

గాఢంగ ప్రేమింతు కాంచలేవా యని
ప్రేయసి మెడపట్టి కోయు నొకరు
దేశాన్ని ప్రేమింతు ద్వేషిని కాదని
చాటు నొక్కరు చంపి జాతిపితను
సమసమాజము కోరి చంపుదునే కాని
నా ప్రేమ నిజమను నక్సలైటు
అన్యాయ మెదిరించు యసలు ప్రేమయనుచు
ఊచకోతలు జేయు నుగ్రవాది
మనసార ప్రేమింతు మాతృభూమిని యని
రోత పుట్టగ రాయు కైత నొకరు

తరచి చూడగ కనిపించు తలపు లందు
గొప్ప ప్రేమ భావము కన్న కోప గుణము
పాల గిన్నెలో పచ్చడి పడ్డ యట్లు
హాయి నిడు ప్రేమ పగిలెను హాని జేయ



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# శబరి

--------

కనులు కాయలు కాచి పోయెను
తనువు నిలకడ తప్పు చుండెను
మనసు స్థిరముగ మసల కుండెను
క్షణము నేనిలువన్

నీదు రాకకు నేల యతికితి
నీదు సేవకు నేను నిలచితి
నీదు పదములె నేను నమ్మితి
ఏది దర్శనముల్

వచ్చితివి యను వార్త తెలియగ
విచ్చు కొన్నవి విరులు వనమున
తెచ్చితిని నే తీపి ఫలములు
పుచ్చుకో యిపుడున్

తనువు నీకై తపము నర్చిన
మనసు నిన్నే స్మరణ జేసిన
కనుల నీరే గాంచ నీయదు
కనగ నీమోమున్

ప్రభుని కరుణకు పాత్రురాలై
శబరి తపములు సఫల మాయెను
అభయముగనే అందరుండగ
శుభ ములే కూర్చున్



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# సీతారామ కల్యాణం

---------------------

ఆకాశమే సిల్చె అందాల పందిరై
  క్రొత్త కాంతులనిచ్చు రూపు దాల్చె
పృథ్వియే పులకించి పెళ్ళిపీటగ మారె
  పెళ్ళికూతురు సొంత బిడ్డ గాగ
గంగ పొంగెను కడుగంగగా పాదాలు
  భద్రాద్రి తీరాన పరవశించి
వాయువేతెంచె సువాసనాభరితమై
  కొలువంగ వేగంగ కొడుకు తోడ
అగ్ని సాక్షిగ సిల్చె లగ్నంబు వీక్షించ
  వేద మంత్రములతో పిడిది కేగె

పంచ భూతాలు తిలకించి ప్రణతులిడగ
ధర్మముత్సాహ మును పొంది ధరణి నడువ
సర్వ జీవులు మెలగగ శాంతి తోడ
విశ్వ కల్యాణ కరముగ పెండ్లి జరిగె
జానకీదేవి శ్రీరామచంద్రులకును



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# తల్లి ప్రేమ

-----------

సీ. పాలతోడుగ మురిపాలిచ్చి పెంచగా
ఏదూర తీరాల కేగ గలవు
బ్రహ్మాండమే చూప బాలుగా ముద్దాడ
ఇంకెటు పోదువు యిల్లు వీడి
అవనినే తలదన్ను ఆజానుబాహుపై
త్రాటిబంధమునెట్లు దాట గలవు
వేదాల కందని వేల్పైనను తల్లి
కౌగిలి వీడెటు కదల గలవు

తే. కోర్కె దీర్చియు పోవగ కోర దేది
ముక్తి నిచ్చియు సాగగ మునియు కాదు
ఏమి కోరక మనసార ప్రేమ చూపు
తల్లి ఎడదను వీడగ తరమె నీకు

సీ. పాలకడలిలోన పవ్వళించినగాని
పరుగుదీయుదువెట్లు పాల కొరకు
సర్వులు నినుజేరి సన్నుతులందింప
అంగలార్చెదవేల అమ్మ కొరకు
ఆదిశేషుని మీద హాయిగా నిదురించి
తల్లివొడినిజేర తర్కమేమి
అందరి మొరలను ఆలించు నీకెట్లు
మారాము జేయగ మనసు కల్గె
శంఖచక్రాది ప్రశస్త్రాయుధములుండ
అమ్మకొంగునుదాగ అల్లరేల
అమృతము పంచిన అద్భుతుండవు నీవు
అడుగనేర్చితి వెట్లు యాకలనుచు



PDF created with pdfFactory trial version www.pdffactory.com

తే. సృష్టి కే మూల మైనీవు కష్ట పడగ
అందరందెడి దొక్కటి యంద లేక
అంత వైకుంఠ వాసంబు లన్నివీడి
ధరణి కేగి పొందితివీవు తల్లి ప్రేమ



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# త్యాగ రాజు

------------

మత్త కోకిల.
ఎన్ని రాగ ములాలపించిన యేక లక్ష్య ము కోసమే
ఎన్ని కీర్తనలల్లి పాడిన యేక గమ్య ము కోరియే
ఎన్ని యూహాలనందినా బతుకెల్ల రామ పదార్చనై
అన్ని రాముడటంచు గొల్చెను త్యాగరాజు ముదంబుతో

సన్మతిచ్చెడు శ్రావ్యమే తన సాధనై వెలుగొందగా
తన్మయత్వ ము గూర్చు పాటలు దైవమే పిన గోరగా
చిన్మయంబగు తత్త్వమే తన చిత్తమందున నిల్వగా
జన్మమే ఘన గానమై కొనసాగె రాముని సేవలో

గానమై రసనిర్ఝరంబగు గంగయై ప్రవహించునే
జ్ఞానమై మదిలోన వెల్గెడు నాదబ్రహ్మ యుపాసనై
ప్రాణమై మన సాంప్రదాయపు పల్లవై నినదించునే
ధ్యానమై భువి శాంతి గూర్చును త్యాగరాజుని కీర్తనల్

శా.
భోగాలయ్యెను రామ పాదములె సంపూర్ణంబుగా గొల్చుటల్
యాగాలయ్యెను రామ నామ చరితంబాలాపనల్ జేయుటల్
రాగాలయ్యెను రామ మంత్ర మునకై రంజిల్లు నాదార్చనల్
నీ గానంబులె తెల్గు భారతికి వన్నెల్గూర్చు సద్భూషణల్



PDF created with pdfFactory trial version www.pdffactory.com

---------------------------------------------------
ప్రముఖ పండితుడు, రచయిత శ్రీ ఇలపావులూరి
పాండురంగారావు గారు అన్నట్లు
"రామ కథా మధువునందు రాగసుధా రసము జేర్చి
శ్రీ రాముని జయరాముని సేవించెను త్యాగ రాజు
ప్రేమ మీర పారిన దిల రామభద్ర రసవాహిని
ఈ స్రవంతి సంతతముగ ఇల వసంత శాంతి కాంతి
వెలయించెను వెలయించును నెల వెన్నెల లున్నవరకు
రవి కిరణములున్నవరకు దివి చుక్కలు వెలుగు వరకు"



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# శ్రీ రామ

---------

సీ. అన్నదమ్ములు పోరు ఆస్తికై యీనాడు
రాజ్యమొద్దని తల్చు భ్రాతయేడి
తనకష్టముకు తప్పు తండ్రిదేయంటారు
తండ్రి మాటను నిల్పు తనయుడేడి
పతులు సతులు మార్చు పద్ధతే స్వేచ్ఛట
ఏకపత్నీవ్రత మేదినేడు
లంచ మందుటయె పాలకుల లక్ష్యముగాగ
ప్రజలక్షేమమె దల్చు ప్రభువు యేడి

గీ. యుద్ధభూమిగ మారె నయోధ్య రామ
చెరచినారయ్య ధర్మాన్ని చిత్తమందె
అణచితివి రావణుని సీతనాదుకొనగ
ధర్మరక్షకు రమ్ము కోదండరామ



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# "వ్యయ" ఉగాది

కాల చక్రము కదులుచున్నది
పరుగు దీయుచు పలుకుతున్నది
వత్సా! సంవత్సరాది నేడని
వత్సా! ఉత్సవంబిది నీకని

అరుగుదెంచే కొత్త యేడుకు
ఆరు ఋతువుల ఆగమమునకు
ఆదరముగా స్వాగతించగ
వసంత కోకిల పాడుతున్నది

వెలుతురెక్కువ విస్తరించగ
రాత్రి గడువు తగ్గిపోవగ
చలియు గిలియు సన్నగిల్లగ
భూమి గమనము మార్చుచున్నది

కొత్త ఆశలు ఆశయములకు
చేతనామయ యత్నములకు
స్ఫూర్తిదాయక సూచకంబుగ
కొత్త పూతలు పూయుచున్నవి

అనుభవాల రుచులనన్నీ
చిలికి చిలికి రంగరించి
తేలికగనే తెలియజేయగ
ఉగాది పచ్చడి అలరుచున్నది



PDF created with pdfFactory trial version www.pdffactory.com

మామిడాకుల తోరణాలు
పసుపు కుంకుమతో గడపలు
ఇంటి వాకిట రంగవల్లులు
కంటికింపుగ కూర్చు శోభలు

సమత మమతలు తెలుపు పలుకులు
కోకిలను మించు మధుర రవములు
పాడిపంటలు పచ్చదనములు
పసిడి కన్నను వెలుగు కాంతులు

క్షయము గాని శాంతి సుఖములు
భయములేని బతుకుతెరువులు
వ్యయమనే ఉగాది మనలకు
స్వయముగా నీయంగ పిలుతు



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# ఆత్మహత్యలు ఆకలి చావులు

అందని పంటలు ఆరని మంటలు
అప్పుల తిప్పలు ఆగని నొప్పులు
వాడిన పైరులు వీడిన ఆశలు
మండిన భూములు మాడిన కడుపులు
కురువని వానలు కరువుల ధారలు
పారని వాగులు కారెడు కన్నీళ్ళు
పురుగుల మందులు ఒరిగిన తనువులు
చితికిన బతుకులు చితులకు చిచ్చులు
ఆత్మహత్యలు ఆకలి చావులు
ఆర్తనాదాలు ఆక్రందనలు
కావేవీ ప్రగతి కనర్హం
రావేవీ ఓట్లకు అడ్డం
తన భోగాలు ధన లాభాలు
ఘన మానాలు గణనీయాలు
పనికొచ్చిందే కనిపించేటి
పెను చీకటిలో పనిపించేది
నడువగలేని నిలబడలేని
తటపట లాడే తరుణములందు
ఊతనివ్వక ఊరకుంటినే
ప్రాణం పోయిన పిమ్మట మాత్రం
బరువు మోస్తినని బాధ నొందుచు
చితికి చేర్చితని చింత నొందుచు
పలుకెడిదెవరని పరిశీలించగ
కనరారెవ్వరు కటిక భూమిలో
వణికినట్టుగా తొణికిసలాడెను
పాడెగ మారిన చెట్టు కొమ్మలు



PDF created with pdfFactory trial version www.pdffactory.com

## వేంకటేశ

----------

సీ. సీ. పద్యమల్లగ నీకు పండితుండను గాను
పదిలముగ వినునా పలుకులన్ని
పాట పాడుటరాదు పరవశంబున నీకు
మదిలోని భావంబు మనవి సేతు
పూజ చేయుటకైన పుష్పంబు లిడలేను
తలపులో నిను జేర్చి తపన పడెద
కనులార నీరూపు గాంచనోచక పోతి
కష్టించి గిరులెక్క గడువు లేక

గీ. శబరి నేలగ నడపికి శ్రమను జెంది
రాజ్యముంపీడి రాలేద రయము గాను
ఏడుకొండలను దిగి నన్నేలు కోగ
వేగ రావేల తిరుపతి వేంకటేశ



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# స్పందన

---------

సీ. శ్వాసలేని శవము చామంతులనుబొందు
మనిషికే కరువాయె మంచి గాలి
పాము పుట్టలుగూడ పాలు నోచితివాయె
దాహార్తులకు నీరు దక్కదాయె
తినని దేవునికేమొ తీపి నైవేద్యమ్ము
కాలే కడుపుకేమొ కంటి నీరు
చనిన వారికి కల్గు చక్కనైన సమాధి
ఉన్నవానికిలేదు ఒక్క గూడు

గీ. గతము కోసము నీరిడు కళ్ళుయెపుడు
కాన గలవె సాటి జనుల కష్టములను ?
కనబడినవారి కష్టాలు గాన లేక
విశ్వ రూపుని వీక్షింప వీలు పడునె ?



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# ఎఱుక

------

సీ. నదులంబుధికి నీరు తుదకిచ్చు చూడగా
ఎపుడు మేఘంబౌనొ ఎవరి కెఱుక ?
మెరుపుతో వర్షించు మేఘమున్ జూచినా
జలమెప్పుడింకునో తెలియ గలరె ?
నిద్రవీడినవేళ నిజముగా తెలిసినా
ఎపుడు నిద్రించునో ఎవ్వరెఱుగు?
పురిటి నొప్పులు తెల్పు పుట్టుకైననుగాని
ఎపుడు శ్వాసాగునో ఎవ్వరెఱుగు ?

గీ. రాక పోకలు కూడ చిత్రంబు లాయె
ఉనికి పూర్తిగ తెలియుట ఉత్త మాట
సన్మతిని పొంద సర్వజ్ఞ సన్నుతింతు
ఎపుడు కరుణింతువోనన్ను నెఱుగ లేను



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# వినాయక చవితి

----------------

(ఆగస్ట్ 2001 లో వినాయక చవితి సందర్భంగా వ్రాసింది)

సీ. తొండంబు యేదైన త్రుంచునే త్రుటిలోన
విఘ్నమున్ పడగొట్ట వీలుపడదె
చేటంత పెద్దగా చెవులునీ కుండగా
వినిపించవా నీకు జనుల ఆర్తి
అతిపెద్ద బొజ్జతో అలరింతువే నీవు
తప్పులన్ కడుపులో దాచ లేవ
ఎలుకపందెంబని తలచేటి బ్రతుకుకు
ఎలుకనెక్కిక దారి తెలుప రావ

గి. భారతంబును ఘంటమాపకనె వ్రాయ
భారతీయుల కష్టాలు బాప గాను
ధర్మ నిరతిని నడుపింప తగిన బుద్ధి
వేగ కరుణించ రావయ్య విఘ్న రాజ

***********

సీ. గారాబముగ నీకు గంగమ్మ జలమీయ
నీటి యిక్కట్లెట్లు నీకు తెలియు ?
అన్నపూర్ణమ్మ నిన్నారగింపగ కోర
ఆకలి బాధెట్లు నీకు తెలియు ?
ముక్కంటి తండ్రియై మురిపింపగా నిన్ను
దీన బాలల గోడు తెలియ గలవె ?
ఎలుక సవారితో యేగేవు హాయిగా
గ్యాసు ఖర్చుల నొప్పి కాన పడునె ?



PDF created with pdfFactory trial version www.pdffactory.com

తే. అక్కసము పట్టలేకనే యంటి గాని
బుద్ధి ధాతవు నీకేమి బోధ పడదు ?
తప్పు లున్నను బొజ్జలో దాచి నీవు
వేగ రావయ్య దయచూప విఘ్న రాజ !



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# ఆకులు రాలె

----------

మరణపు వార్తలు మ్మ్రడిగ మానసమందు మెలంగుచుండగా
తరుణము కాదు శాంతికని తాపమునొందు చుపైకిచూడగా
శరణము నీవె మాకెపుడు శ్వాసను పీల్చెడిదాక యంచుయా
తరువులు పూజ సల్పుటను తన్మయమొందగ చూడగల్గితిన్

వెలుగులు తక్కువాయె నిశివేళలె యెక్కువకాల మిప్పుడున్
చలి మొదలయ్యెనిక్కముగ చర్మములొల్చెడి తీవ్ర ధాటితో
ఫలములు లేవు మాకడను, భక్తితో నీవ్రతమాచరింపగా
కొలుతుముయున్న మాపసుపుకుంకుమలద్దిన యాకులిచ్చినిన్

తలపులు రాలె యాకులుగ, తగ్గెను దేహపు శక్తి కాంతియున్
తొలగెను ధైర్య దర్పములు తోచిన దిక్కిక నీదు పాదముల్
నిలిచి దిగంబరుండునగు నీ పతినామమునెంతుమమ్మ, మీ
కొలువున నుంచి మమ్ము మది కోవెల జేసిన చాలు శాంకరీ !



PDF created with pdfFactory trial version www.pdffactory.com

## తల్లి మాట

----------

సీ. ఎట్లున్నవు కొడుక గిట్లెప్పుడొస్తివి ?
ఎన్నియేండ్లు గడిసె నన్ను వొదిలి
దూర దేశము పోయి మారిపోయినవేమొ
యాదికుంటినొనేను అడుగుచుంటి
కారులెక్కుతవంట బీరుతాగుతవంట
బూరెలడ్డుతినుట బోరు అంట
సూటుబూటులతోనె షోకుకొడుతవంట
పట్టుబట్టలుకూడ పాతవంట

గీ. ఎంత మారినా నువునా సొంత బిడ్డ
ఏమిచేసినా నీ మంచి యెంచు తుంటి
గుర్తు పట్టలేదా నను కొడుక యింక ?
పండు ముసలిని నీ మాతృ భాష నేను



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# శ్రీ రామ

శా. మాయాలేడని నీవెఱింగియు మదిన్ మన్నింపగా జానకిన్
వేయంగా ఘనమైన నీదు శరమున్ వేగంగ నీవేగగా
సాయంబిమ్మని పంపె లక్ష్మణునినీ సామర్థ్యమున్ మర్చియున్
పోయెన్ గీతలుదాటి భిక్షమిడగన్ భూజాత మాయావికిన్

కం. నిన్నే నిత్యము దలచియు
మున్నెన్నడు లేని విధము ముచ్చటపడగా
ఉన్న పలాన ధరణిజకు
కన్నీటి కడలి యగుపడె క్షణ కాలమునన్

సీ. రాజభోగములన్ని రాముడే యని దల్చి
సాధ్వికే కరువాయె స్వామి చూపు
రాముడున్న యడవి రమ్యంబుగా దోచె
హర్మ్యశోభల లంక యడవియయ్యె
సత్యసుప్రియమగు స్వామి పల్కులు విని
కామాంధు నాలించు కష్ట మొచ్చె
ధర్మమూర్తి నిలువ ధరణి సైతము పొంగె
ధరణిజ స్థితిగని తరులు క్రుంగె

తే. ననుచు నాడి దంపతులెంతో నాత్ర పడగ
ఎప్పుడరుదెంచునో రాముడిచ్చటకును
ఎంత దుఃఖంబు నుండెనో యిప్పుడతడు
బ్రతుకుటెన్నాళ్ళు నీరీతి రాము కొఱకు
ననుచు తపియించె విలపించె నవని తనయ



PDF created with pdfFactory trial version www.pdffactory.com

సీ. రాజ్యంబు నీకీయ రాదంచు పల్కిన
మంథర పైనెట్లు మండి పడవు
మంథర మాటలు మన్నించి కైకేయి
యడవికంపెనని నీవలుగవెట్లు
కనకమృగము గోర కష్ట మొచ్చెననుచు
తప్పుపట్టవు సీత నెప్పుడెట్లు
అలసెనని గడుపీయ మనసెట్లొప్పెనో
రావణాసురునకు రణమునందు

తే. పుడమి కంపించు నెప్పుడైన కడలి తొలుకు
నిప్పు చల్లారు స్థంభించి నిల్చు గాలి
ఎపుడు మారక నిత్యంబు నిలను మెలగు
హేతురహితంబు నీప్రేమ యెఱుగుటెట్లు

కం. అన్నా అయోధ్య రమ్మని
కన్నీరు తొనీదు కాళ్ళు కడగిన భరతుం
డెన్నగలడేమొ సత్యము
సున్నితమగు నీదుప్రేమ సొంతగ కొంతన్

సీ. తల్లిదండ్రుల గొల్చు తనయుడుండినగాని
అన్నదమ్ముల పట్ల అలుగునేమొ
తోడబుట్టువుల సంతోషపెట్టినగాని
యిల్లాలి కనురాగ మివ్వడేమొ
సతితోడ ప్రేమతో సతతముండినగాని
తనయుల లాలింప తరము గాదొ
బిడ్డల పోషించి పెంచు పిత్రుండైన
ప్రజల పాలిట మంచి ప్రభువు కాడొ
ప్రజలమేలును గోరు ప్రభువు యైననుగాని

భృత్యుల తానాదరింపడేమొ
సేవకులకుతాను క్షేమంబు గూర్చినా
జంతుజీవులపట్ల జాలి లేదా
భూతదయనుచూపు నేతయైనను గాని
ద్వేషంబు రిపులపై పీడ డేమొ
శత్రువును సైతంబు సాదరించిన గాని
రాయిరప్పలు లెక్క చేయడేమొ
శిలనుసైతము తాను చీదరింపకయున్న
అందఱకును తాను అందడేమొ

తే. అట్లు నీవొక్క రూపంబు నవతరింప
వశమె సేయంగ నీయొక్క వర్ణనంబు
శక్యమగునె నీ గుణములు సన్నుతింప
సర్వజీవుల లోనుండు సాక్షి వయ్యు
తేట తెల్లంబు గానిన్ను తెలియు టెట్లు
చేత నైనరీతిగ నీకు జోత లిడుదు

సీ. వనవాసముకు సిన్ను పంపగోరను గాని
మదిలోన కొలువుండ మనవి సేతు
కనక మృగము కోరి కష్టపెట్టను గాని
సముచితంబగు సిరి చాలునాకు
సేతుబంధనమును సేయమనను గాని
మోహాంబుధిని నన్ను మునుగ నీకు
అసుర వీరులజంప యడుగబోవను గాని
శాంతి పొందగ మది సాయ మిడుము



PDF created with pdfFactory trial version www.pdffactory.com

తే. నీవు దయతోడ నండగ నిల్చినంత
వానరులె దాటిరంబుధి త్వరిత గతిని
చంచలత్వంబుతో మది సంచరించు
కపిని తలపించు మనసును కనిక రించు
నీదు సేవను జేయంగ నిలకడిమ్ము
తలపు మారక మునుపునే తనివితీర
వేగ బ్రోవంగ శ్రీరామ వేడుకొందు

********

సీ. తాటకిని దును మ తరలి పొమ్మన గాని
అజ్~ఆన తి మిర మ్ము నంత రించు
రాయినాతి గ నిన్ను చేయ మనను గాని
పాషాణ హృదయాల పంచు కరుణ
కనక మృగ ము కోరి కష్ట పెట్టను గాని
సంతృప్తి నిచ్చిన చాలు నయ్య
శబరి యెంగిలి మింగ శ్రమపడ మన గాని
మాట చేదును మింగు నోటి నిమ్ము
కోతుల తోకట్టు సేతువ నను గాని
కలసి పనిని జేయు గరిమ నిమ్ము
అసుర వీరుల నీవు నణచ మనను గాని
క్రూర భావాల రూపు మాపు
దహియించు లంకను దయచూడ మన గాని
కొంప లంటించెడు గుణము బాపు



PDF created with pdfFactory trial version www.pdffactory.com

తే. ఉడుత సాయము గమనించి యుబ్బి పోయి
స్వర్ణ రేఖల నందించు స్వామి నీవు
చేయు యత్నము లన్నియు చిన్న వనక
బతుకు లన్నియు బంగారు బాట లవగ
పుడమి యంతయు శాంతితో పుల్కరింప
నదులు మనసులు కలుషాలు వదలి పార
మాన వత్వము నిత్యము మనిషి నుండ
వేగ రావంగ శ్రీ రామ వేడు కొందు



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# స్వాతంత్ర్య శుభాకాంక్షలు

తే. భరత ఖండంబు చక్కని భాగ్య సీమ
ఎందరోదీన దారిద్ర్య మందు మ్రగ్గ
పరమ పావని గంగయె పారు నిచట
త్రాగునీటికి యెందరో తల్లడిల్ల
అన్నపూర్ణమ్మ నిలుచున్న యవనిలోన
కడుపు నింపగ యెందరో కష్టమొంద
కళ్ళ యెదుటనె నున్నది కారణంబు
తోటి వారను భావంబు త్రోసి పుచ్చి
వీర మూర్తుల త్యాగాలు విస్మరించి
స్వంత లాభంబు కై దేశ సంపదలను
కొల్ల గొట్టెడు వారలు కొలువు దీర
ఏమి స్వాతంత్ర్య మిదియయ్య యేమి ఫలము
అడవి మృగములకైనను హద్దులుండు
తమకు యాకలి తీరిన తరుణమందు
స్వేచ్ఛ యున్నను సేయవు వేట నవియు
కోట్లు మ్రింగియు యాగక కొంచెమైన
ఎదుటి వారిని స్వేచ్ఛగ నెపుడు దోచు
నీతి విలువల నెరుగని నేత లుండ
ఇంక నిజమైన స్వాతంత్ర్య మెట్లు కలుగు ?

శ్రీ చిలకమర్తి గారికి క్షమాపణలతో,



PDF created with pdfFactory trial version www.pdffactory.com

## ముగ్గురమ్మలకొక్క మనవి

శా. వేలంబాయెను పెళ్ళి కట్నములకై వేధించగా కన్యలన్
కూలెంకొంపలు కాపురాన పతియై క్రూరంబె నిల్వుండగా
కాలే కాష్ఠము నందు త్రోసి పడతిన్ కాల్చంగ దిక్కేదియున్
ఏలే శక్తివి దుర్గ లోకజననీ యేమమ్మ యీ మౌనమున్

ఉ. ధర్మము వీడి పొందిరట దానవులైనను పెక్కు సంపదల్
కర్మము పాప పంకిలము కాగ ధనంబు గడించెనెందరో
నిర్మల సద్గుణాబ్ధి యగు నీపతి సన్నిధి నుందువెప్పుడున్
మర్మమిదేమి దుష్ట మతి మంతుల చెంతకు బోవ శ్రీసతీ

చం. పరమపవిత్ర శబ్ద ఘనభావములెల్లయు నిచ్చు దైవమై
వరలెడు విద్యలన్నిటికి వాఙ్మయమంతకు వేల్పు నీవెయై
స్వరరసగాన మాధురికి వైదిక సంస్కృతి కాలవాలమై
పరుషపు ద్వేషపూరితపు పల్కుల నిత్తువదేల భారతీ

సీ. హత్యహింసలు నేడు నిత్యదృశ్యములాయె
సాటివారిని జంప యాట యయ్యె
దుర్గుణంబుల ద్రుంచ దుర్గమ్మ రావమ్మ
పాశవికతను నీబలిగ గొనుమ
షట్సంపదలతోడ సౌఖ్యంబులీయంగ
శ్రీలక్ష్మి రావమ్మ శీఘ్రముగను
అజ్ఞానతిమిరంబు నణగించి వాగ్దేవి
సద్వివేకము నిమ్ము సత్వరముగ



PDF created with pdfFactory trial version www.pdffactory.com

తే. మరణకాండకు నెపములు మతములయ్యె
ఉగ్రవాదంబని జరుగు నూచకోత
మానవత్వమె యడుగంటి మాసి పోయె
తల్లడిల్లిన బిడ్డల తల్లులార
వేగ రారమ్మ బ్రోవంగ జాగు సిడక



PDF created with pdfFactory trial version www.pdffactory.com

## ఇచ్చుట

సీ. ఒరుగునే మి రవికి నుదయించి వెలుగివ్వ
కోరకుండగనిచ్చు గుణము కాదె
కలుగులాభంబేది జలమివ్వ నదులకు
కోరకుండగనిచ్చు గుణము కాదె
తమకే మి ఫలమందె తరువులు పండ్లివ్వ
కోరకుండగనిచ్చు గుణము కాదె
ఏసౌఖ్యముకు గుండె యెప్పుడు శ్రమియించు
కోరకుండగనిచ్చు గుణము కాదె

తే. ఎన్ని జలములున్న నదుల సింక గోర
ఉప్పు మయమయ్యె నంబుధి గొప్ప కలి మి
మదిని ప్రతిఫలంబు నెపుడు మనిషి గోర
ఉప్పు మయమైన రక్తంబు యుండ తగదె



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# రామ గీతి

---------

రామచంద్రుని గీతి
వాయుసుతునకు ప్రీతి
రాక్షసులకిడు భీతి
తీర్చు భక్తుల ఆర్తి

తేనె చక్కెర తీపి
ఎక్కువైతే బీపి
సర్వశుభముల రాశి
రామ నామము తీపి

రాజకీయపు పొరలు
దాచు స్వార్థపు చెదలు
రఘుకులేశుని కథలు
ధర్మరక్షకు సుధలు

కలిసి కట్టిరె కపిలు
సేతుబంధన మిలను
ఐక మత్యము తోడ
కానిదేమిటి చూడ

కనక మృగమును కోరె
సీత సుఖములన్నియు పోయె
ఉడుతసేవలనిడగ
కనకరేఖలు బడసె



PDF created with pdfFactory trial version www.pdffactory.com

కలి మిలే మి లందు
స్పృహను పీడని వాడు
జీవరాశినెల్ల ఆదరించినవాడు
సిలువ మనసుల నేడు
కొలుతు రాముని నేడు



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# రాజా రామన్న

-------------

(దివంగత శాస్త్రజ్ఞుడు శ్రీ రాజా రామన్న స్మృతికి నివాళులతో)

తిరుగులేని బాణం రామునిదన్నాం
ఎదురులేని గాండీవం పార్థునిదన్నాం
సాటిలేని సుదర్శనం శ్రీహరిదన్నాం
నిలువలేని ప్రళయాగ్ని ముక్కంటిదన్నాం

అపూర్వమైన అమోఘమైన అదిరిపడే అణుబాంబు
ఆశ్చర్యం ఆవేదన ఆక్రందనల అలలురేగ
ఒక్కసారి పేలినంత దిక్కులదరు శోకాగ్నిని
అది మివేసి అగ్నిజేసె అంతలోన రెండవది

అణగారె అవని శాంతి అంకురించె మారణాగ్ని
అణుబాంబుల రాశులె అధికశక్తిరూపమయ్యె
ఆయుధాల అమ్మకాలె అంతులేని సంపదయ్యె
అమిత శక్తి దర్పాలె అగ్రరాజ్యంబులయ్యె

సాధించిన స్వాతంత్ర్యం బోధించిన గతచరితం
వేధించెడు ఇరుగుపొరుగు బాధించెడు బలహీనం
శోధించెను మస్తిష్కం ఛేదించెను అణురూపం

హరివిల్లు విరిచినట్లు, హరివిల్లే విరిసినట్లు
మెఱుపు వీడి నడచినట్లు, చైతన్యం మెరిసినట్లు
రాజు కాదు రామ కాదు, రాజా రామన్నకు చప్పట్లు
శ్రమపడు శాస్త్రజ్ఞులు, అందరంజలిచ్చినట్లు



PDF created with pdfFactory trial version www.pdffactory.com

జనశక్తి అణుశక్తి, తన బాణం తన యోగం
పీటికి కాదెన్నడు గమ్యం, కాదెప్పుడు ప్రేరకం
పరద్రవ్యం పర నష్టం, పరపీడన పరాయణం
అని చాటే దేశం, మనుగడకే సందేశం.



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# కొన్ని మాకు మిగిలించు

--------------------

పాటలాగ సాగిపోయె, పడవలాగ తేలిపోయె
రచ్చలేక రచ్చబండ, స్వచ్చంగా తూలిపోయె

అలపెరుగని మెసేగీలు, అలలవోలె తరలిపోయె
తలపుల ఊగిసలెన్నో, తరలి తరలి దరికిజేరె

రాగభావ సరిగమలు, రమ్య నుడుల మధురిమలు
గతకాలపు గీతికలు, పొంగుపాల మీగడలు

పలుకలేసి బండకూడ, పాడి పరవశించిపోయె
చెవులు లేసి "రచ్చబండ", "చిత్ర"మైన కథలు తెల్పె

అన్ని నదులు పారి పారి, అంబుధిలో చేరినట్టు
అన్ని తీపి గురుతులను, ఉప్పు నీట ముంచినట్టు
ఎన్ని తీపి కథల సుధలు, ఎన్ని శ్రావ్య శబ్ద ఝరులు
ఓ గతమా అన్నిగైకొనకు, నేటి రేపు కాలమునకు
వెన్న నిచ్చు పాల వోలె, కొన్ని మాకు మిగిలించు!



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# మూగబోయెను

(భారత రత్న శ్రీమతి ఎం.ఎస్. సుబ్బులక్ష్మి గారు మరణించినప్పుడు వ్రాసింది)

మత్తకోకిల:

మూగ బోయెను గాన కోకిల ముగ్ధ మోహన కంఠమే
రాగ మాధురి భక్తి భావము రాజ్యమేలిన నాదమే
త్యాగరాజును అన్నమయ్యను తానె చూపెను పాటలో
ఏ గుణంబదొ దివ్య తన్మయ మిచ్చి మీటెను గుండెలన్

భారతీ కరవీణ పల్కిన భవ్య నాద తరంగమై
నారదామృత గానమై భువి నాదరింపగ వచ్చెనో
పేరు పొందియు గర్వమొందక పెక్కు సేవలు సేయుచూ
పేరు లోకము చూపియే తను పేరు లోకము కేగెనే



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# అగరు బత్తి

----------

సీ. మనసును హాయిగా మరపింప జేసేటి
పరిమళం బెవరిది తరచి చూడ
గుడిలోన నిలిచినా గుడిసెలో మసలినా
సేదదీర్చు నెవరు కాదు యనక
రగులుచున్నను గాని రంజింప నెవ్వరు
మంచి వాసనలను పంచు చుండు
తరగు యాయువు గాంచి తరగని దీక్షతో
సేవ సేయు నెవరు చింత లేక

తే. బతుకు నంతయు నొరులకై బతికి నీవు
బూడిదైనను వాసన వీడ వెపుడు
అన్ని పూజలు చేయంగ నిన్ను వాడ
ఆదరించుట నిన్నెట్లు అగర బత్తి



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# శివ

---

సీ. ఆకాశమే నీకు అంబరంబుగ మారె
ఎట్టి వస్త్రాలు నీకిత్తు నేను
ఓంకారమే నీకు కైంకర్యములు జేయ
నిన్నెట్టి శబ్దాల సన్నుతింతు
నిర్మలంబగు గంగ నీశిరంబందుండ
స్నానసేవలనేమి సలుప గలను
అన్నపూర్ణమె నీకు అర్థాంగియైయుండ
ఎట్టి నైవేద్యములిత్తు నీకు

గీ. కొలువ నీ రూప మొకసారి కోర్కె దీర
పిలువ నీ నామ మొకసారి ప్రేమ తోడ
నామ రూపాల కందని స్వామి నీకు
నామ రూపాల నిచ్చితి నను క్షమించు

శా. సంపాదించిన యాస్తి వస్తు ధనముల్ సత్కీర్తి సన్మానముల్
సొంపౌ యాభరణాలు గొప్ప బిరుదుల్ శోభిల్లు సౌందర్యమున్
సంపూర్ణంబుగ బాపు కాల విషమున్ శంభో భరించేవు వ
ర్ణింపంజాల భవద్గుణాలు మది నిన్నిక్కాల మున్ గొల్చెదన్

*****************

సర్వజ్ఞుండను పేరు సత్య మగునో! శంకింతునో శంకరా
పర్వాలెవ్వెట్టి యశాంతి గొల్పు మదియున్ బాధించు మోహంబులున్
నిర్వీర్యంబుగ జేయు భావనములు నీ్నకెట్లు గ్రాహ్యంబగున్ ?
సర్వేశుండవటంచు గొల్తు నిడుమా సత్ప్రేరణల్ శాంతియున్



PDF created with pdfFactory trial version www.pdffactory.com

ఏవో సంపదలంద వత్తురని నీవేకంగ యాచింతువో
ఏవో సౌమ్ముల నీయ మందురని నాగేంద్రంబునే దాల్తువో
ఏవో విందులు కోర వచ్చునని విషం బిష్టంబుగా గొంటివో
దేవా వద్దవి యేవి చాలు కృపతో దీవింపు మాలోచనల్

నీ సామీప్యము పొంది గంగ భువికిన్ నీరిచ్చి పోషించునే
నీ సాంగత్యమునంది యన్న మిడునే నీయొక్క యర్ధాంగియున్
నీ సాన్నిధ్యము నిల్చి విఘ్నములు విఘ్నేశుండు వారించునే
నీ సంసేవకు నిమ్ము సత్వరముగా నిస్వార్థ భావంబులన్

*************

(శివరాత్రి సందర్భంగా వ్రాసింది)

అర్చనై అనునిత్య మభిషేక మొనరించు
సేవకై గంగ నీ శిరము నుండ
వక్రమై నీశిరో వజ్రమై నెలవంక
మెరియుచు మురియుచు వరలు చుండ
గరళమై గళసీమ కది యాభరణమై భ
యము బాపి యమృతము నభయ మీయ
చేరువై మణి మయ హారమై విప్పిన
పడగతో నినుజేరి పాము నిల్వ
తాళమై నీనిత్య తాండవ కేళికై
ప్రతి గుండె లయముగ పలుకు చుండ
నాదమై నినదించు వేదమై ప్రణవమే
ప్రస్తుతింపగ నిన్ను పరవశముగ



PDF created with pdfFactory trial version www.pdffactory.com

జీవ రాశుల కంతకు చేతనమును
ఒసగు శక్తి యర్ధాంగియై యుండి కొల్వ
తార లన్నియు భవహర! వారతీయ
సర్వ మంగళ సుందర సాంబ మూర్తి
పిశ్వ శాంతిని పెలయింప వేడు కొందు



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# నడిచే చీమ

-----------

సింగిని ఎగిరే పక్షుల చూస్తూ
అనుకోదెప్పుడు నడిచే చీమ
తానెంతో తక్కువని

జలధిని ఈదే చేపలు చూస్తూ
అనుకోదెప్పుడు నడిచే చీమ
తానెంతో తక్కువని

దూరము పారే ఏరును చూస్తూ
అనుకోదెప్పుడు నడిచే చీమ
తానెంతో తక్కువని

రంగుల శోభల పువ్వును చూస్తూ
అనుకోదెప్పుడు నడిచే చీమ
తానెంతో తక్కువని

సుమధుర కోకిల గానము వింటూ
అనుకోదెప్పుడు నడిచే చీమ
తానెంతో తక్కువని

సింగికి ఎగురగ నేర్చిన మనిషి
జలధిని జొచ్చియు రాగల మనిషి
దూరము లెన్నో పోగల మనిషి
అందముగా ఇల మార్చెడు మనిషి
రసమయ భాషను పల్కెడు మనిషి
మనసది తనది వశమును తప్పగ



PDF created with pdfFactory trial version www.pdffactory.com

నడువక లేక సిలువక లేక
తక్కువ తానని తలచగ చూస్తూ

అనుకొనునేమో నడిచే చీమ
తానెంతో ఎక్కువని !



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# పులి

కనిపించింది నాకొక పులి
అయిపోయింది అనుకున్నా నా పని

బోనులో ఉంది కాబట్టి సరి
బతికి పోయాను కాకుండా బలి

ఎదురుగా చూసింది ఒక పరి
అదరించింది దాని చూపుల గురి

నోరు విప్పిందది తదుపరి
నోరు తెరిచాను నేను భయపడి

అడుగువేసింది ముందుకది
అప్పుడు తీసానొక ఫొటో జరిగి

అంతలో గాండ్రించింది నిలబడి
కాంకార్డరు నొక్కలేకపోతి తడబడి

ఎంత రాజసమో దాని అడుగులలో
ఎంత ఠీవియో దాని కదలికలలో

ఎంత బలమో దాని కండలలో
ఎంత అందమో దాని దర్పంలో



PDF created with pdfFactory trial version www.pdffactory.com

ఉరుకుతే అది ఉంటుంది మజా
ఊపిరుంటదా అది వేస్తే పంజా

ఫొటోలు తీసినా పోయెట్రి రాసినా
పోదేదో వెలితి ఎంత ఆలోచించినా

అద్భుత భయాశ్చర్యాలకు అది ఆనవాలు
అయినా పట్టుకోలేను దాన్ని ఇంట్లో పెట్టుకోలేను

ఈ వెలితి తీర్చదా దాన్ని సృష్టించిన తల్లి
అందుకే సృష్టించిందేమో అనుకూలంగా పిల్లి !

తల్లీ! నీ సృష్టి బహు చమత్కారం
తలవంచి నీకిదే నా నమస్కారం



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# చెన్నప్ప నానీలు

---------------

నానీలు పుట్టి పదేళ్ళు అయినా, పదిలంగా నిలిచే బాణీలో నానీలు చెప్పిన ప్రతిభావంతులు తక్కువే. డాక్టర్ మసన చెన్నప్ప గారి "చెన్నప్ప నానీలు", పేరుకు తగ్గట్టు 48 పేజీలతో చాలా చిన్న పుస్తకం. కాని గుండెను తాకే గుణంలో పెద్దదే.

"ఎలాంటి భావమైనా 20-25 అక్షరాల్లో నాల్గు పాదాల్లో ఒదిగిపోయే తీరును చూస్తే ఈ ప్రక్రియ గొప్పతనం ఏమిటో తెలుస్తుంది" అని అన్నారు రచయిత ముందు మాటలో. అయితే వారు చెప్పుకోనిది, అంత తక్కువ నిడివిలో భావాన్ని చెప్పటం ఎంతో కష్టమైన పని అని.

మచ్చుకు నాకు నచ్చిన కొన్ని నానీలు వారి పుస్తకం నుండి.

-----------------------------------------------------

[Source: "చెన్నప్ప నానీలు" - డాక్టర్ మసన చెన్నప్ప ]

కడుపులో వున్నప్పుడు తంతే
బాధ లేదు
బయట వుండి తంతేనే
నరకం

ప్రేమికులు
ఎండలో మాట్లాడుకుంటున్నారు
ఎండ
వారి జోలికి వెళ్ళదు



PDF created with pdfFactory trial version www.pdffactory.com

వాన రాకపోతే
కన్నీరా ?
జాగ్రత్త
అవి కూడా అయిపోయేను

నేను
కష్టాల్లో వున్నాను
ఈ దెబ్బతో
మిత్రులెవరో తేలిపోతుంది

అతడు నిన్ను
తెలియక బాధపెట్టాడు
నువ్వో
తెలిసి బాధపడాలా ?

వేళ్ళు
నాలో భాగమే
మట్టి అంటుకుందని
ఎలా నరుక్కుంటాను ?

కారుందని
కాళ్ళు పక్కన పెట్టావా ?
నడవడానికి కూడా
పనికి రావు



PDF created with pdfFactory trial version www.pdffactory.com

కోతి నుంచి
మనిషి వచ్చాడా ?
పాపం
కోతికెంత అవమానం !

నగరంలో
రోడ్ల మీద మ్యాన్ హోల్స్
వ్యవస్థకు పడిన
కన్నాలు

అంతా బాగుంటేనే
అర్ధాంగి
దెబ్బ తగిలిందా
'అమ్మా' అంటాడు

ఇన్ని
డిగ్రీలెందుకు నాయనా ?
చెల్లని రూపాయికి
ఎక్కువ గీతల్లా

అమ్మను
ఏమన్నా అన్నావంటే నేనూరుకోను
అమ్మంటే
అమృత వ్రా!



PDF created with pdfFactory trial version www.pdffactory.com

గొప్ప కవిత్వం
అంటే ఏమిటి ?
నిత్య నూతనం
సత్య సుందరం!



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# ఒక్కొక్క పేరు బహు తీపి

----------------------

సిద్ధకపి, సార్థకనామధేయుడు. శ్రీ రామకర్ణామృతంలో
అనువాద పద్యాలు, అనితర సాధ్యాలు! రాముని రూపుకట్టిన ఒక
పద్యం.

శ్రీరామున్ శశికోటికాంతివదనున్ సీతామనోనాయకున్
ధీరున్ విశ్వగురున్ బరేశు సరయూతీరప్రచారిన్ హరిన్
ధారాభృత్సమనీలు కౌస్తుభధరున్ ద్రాతన్ సుపర్వేశ్వరున్
శౌరిన్ సర్వఫలప్రదున్ కొలిచెదన్ సత్యాత్ము సౌమ్యాకృతిన్

"సత్యాత్ముడైన సౌమ్యాకృతి" అనే పదచిత్రం చూపుకందని రూపును
మనసులో చిత్రిస్తుంది!

ఆ రాముడు స్తవనీయుడు, కమనీయుడు, సుకుమారుడు, రణధీరుడు,
పరంధాముడు అని చెప్పి, చివరగా అఖిలాత్ముడు అని అంటాడు
ఒక ఆధునిక రచయిత "శ్రీ రామ నామాలు శతకోటి,
ఒక్కొక్క పేరు బహు తీపి" అనే పాటలో. అఖిలాత్ముడు కనుకనే
అతనికి శతకోటి నామాలు.

సినిమా పాటైనా, ఆ సన్నివేశమేదో తెలియకున్నా ఆకట్టుకునే
ఆ పాటను రాసిందెవరో! బహుతీపైన పాటను అంతే తీయగా పలికారు
సుశీల గారు తమ గళంలో.



PDF created with pdfFactory trial version www.pdffactory.com

తర తరాలకు తరగని ధనం
ఇహపరాలకు వెలుగిడు ఫలం
భవభయాలను దునిమెడి రవం
నరనరాలకు ఒసగెడు బలం
చరచరాలకు కలుగగ జయం
క్షమదయాలిడు మంగళ ప్రదం
నిరుపమానము రాముని పదం!



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# బస్సులో సీటు పాయె, బతుకంతా చీకటాయె

(ప్రితింగ్ అఫ్టెర్ రీదింగ్ థిస్:
హ్ట్ప్://వ్వ్వ్.హిందు.చొం/2007/04/09/స్తొరిస్/2007040918780100.హ్త్మ్
)

ఒక్క మాట ఒక్క మాట
పెనుగులాట పెద్దగాయె

ముందు చూపు లేక పాయె
మంద బుద్ధి ఎక్కువాయె

ఒకరికొకరు దూరమాయె
ఉద్రేకము ఉప్పెనాయె

మనిషి మనసు కరడుగట్టె
ఆవేశము బుసలు కొట్టె

బస్సు నడుపు చేతులే
బయటకు నూక లేచెనే

బస్సులో సీటు పాయె
బతుకంతా చీకటాయె



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# ప్రమాదం

---------

ఒక్క లారీ, ఒక్క ఆటో
ఒక్క కారు, ఒక్క రైలు
ఒక్క వాగు, ఒక్క బస్సు
ఒక్కటైతే బతుకులన్నీ ముక్కలే

ఒక్క గంటలో బతుకులు తారు మారు
ఒక్క గుంటతో మనుషుల రాత మారు

ఒక్క క్షణము కునుకు
ఒక్క పెగ్గు మందు
ఒక్క వ్యక్తి దుడుకు
ఎన్ని బతుకులు చితుకు

ఎన్ని గుంటలు నేర్పుగా దాటితే
ఎన్ని కన్నులు జాగ్రత్తగా చూచితే
ఎన్ని చేతులు సిలకడగా నడిపితే
ఒక్క పయనం చేరుతుంది గమ్యం

రక్తసిక్తమైన రోడ్డుని
కన్నీళ్ళే కడుగుతుంటే
ప్రమాదం జరిగిందని చూస్తారు అందరు
ప్రమాదం జరగకుండా చూసే వారు ఎందరు



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# ప్రేమ

------

గాఢంగ ప్రేమింతు కాంచలేవా యని
ప్రేయసి మెడపట్టి కోయు నొకరు
దేశాన్ని ప్రేమింతు ద్వేషిని కాదని
చాటు నొక్కరు చంపి జాతిపితను
సమసమాజము కోరి చంపుదునే కాని
నా ప్రేమ నిజమను నక్సలైటు
అన్యాయ మెదిరించు యసలు ప్రేమిది యంచు
ఊచకోతలు జేయు నుగ్రవాది
మనసార ప్రేమింతు మాతృభూమిని యని
రోత పుట్టగ రాయు కైత నొకరు

తరచి చూడగ కనిపించు తలపు లందు
గొప్ప ప్రేమ భావము కన్న కోప గుణము
పాల గిన్నెలో పచ్చడి పడ్డ యట్లు
వాయు నిడు ప్రేమ పగిలెను వాసి జేయ



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# పలుకు అల్ల

---------------

మక్కా మసీదులో మారణ హోమమా
నా వూరు యల్లాడె నమ్మలేను
అల్లా సన్నిధి లోన యార్త నాదంబులా
చేటు చేయుట కెట్లు చేతు లొచ్చె
శాంతి ప్రార్థన మధ్య చంపేటి బాంబులా
మారెనా రాయిగ మనిషి గుండె
శుక్ర వారము నాడు శోకముప్పొంగగా
హింస జేసెనెవరు హేయ ముగను

పట్ట పగటి పూట పచ్చెనెత్తురు పారె
చార్మినారు కాడ చావు లయ్యో
ప్రార్థనలు జరుపగ ప్రాణాలు తీసిరి
ప్రార్థనేమి జేతు పలుకు మల్ల



PDF created with pdfFactory trial version www.pdffactory.com

## సన్నుతి

--------

సీ. శిశువుయై చెరసాల ఛేదించు శక్తియై
నది మధ్య నడిపించు నందనుండు
బాలుడై సిర్జించ కాలుడై యసుర సం
హారుడై నవనీత చోరుడగుచు
శూరుడై గోప కిశోరుడై వేణుగా
నామృతాంబుధి దేల్చు నగధరుండు
బంధువై కారుణ్య సింధువై దీనుల
చింతలంతము జేయ చెంత నుండు
ధీరుడై కొంగు బంగారమై మానప్రా
ణంబులన్ గాపాడు నాథుడగుచు
దూతయై శాంతి కపోతమై ధర్మంబు
నెలకొల్ప యత్నించు నేస్తమగుచు
రాజుయై కోరిన రథ సారథై ముందు
దారి జూపెడు గీత దాతయగుచు
సత్యమై యపురూప సత్వమై మురిపించు
మూర్తియై వెలిగెడు మోహనుండు

తే.గీ. సరస సమభావ లక్షణ సమ్యుతుండు
సుంత వాడని దరహాస శోభితుండు
విశ్వ కళ్యాణ కర కృపా వీక్షనుండు
వేంకటాచల శిఖరాన వేడ్కనుండు
సాటి లేనట్టి స్వామిని సన్నుతింతు



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# కృష్ణ

-------

వరమై దేవకి పుణ్య పంట ఫలమై వర్షించు కారుణ్యమై
స్వరమై స్ఫూర్తిడు వేణుగానరవమై సమ్మోహనాకారమై
పరమై ధాత్రిని ధర్మరక్షణముకై పర్వేట్టు చైతన్యమై
స్థిరమై సాక్షిగ నిల్చు శక్తి కృపకై సేవింతు సత్కాంతికై



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# పలుకులమ్మ

------------

(శ్రీ రమణము ఛందస్సులో వ్రాసింది)

మాటలు నీవే మంత్రము నీవే
పాటల లోపలి ప్రాణము నీవే
తేటతెలుంగుకు తీపివి నీవే
బాటను చూపెడి భావము నీవే

చేతనమే నీ చిహ్నము లాయెన్
కేతనమై స్మృతి కీర్తన సల్పెన్
శ్రోతలుగా హరిరుద్రులు నిల్చెన్
పోతన పల్కులు పూజలు జేసెన్

వేదపు ఘోషల్ వేడును నిన్నే
నాదము పల్కెడి నామము నీదే
నీదయ చూపగ నిల్వుము నాల్కన్
పాదము లే మది భక్తితొ గొల్తున్



PDF created with pdfFactory trial version www.pdffactory.com

## చివరి మాట

-------------

ఎన్ని మాట్లాడుకున్నా, ఎంత చెప్పుకున్నా విమానాన్నో రైలో ఎక్కే ముందు వీడ్కోలుగా చెప్పే మాట, ధోరణి, చూపు, ఆ అనుబంధాన్ని, వ్యక్తిత్వాన్ని, ఆత్మీయతను ఏ కెమెరాలు బంధించలేని విధంగా మనసులో నిలిపేస్తాయి.

ఇక జీవితపు చివరి మాటల గురించి వేరే చెప్పేదేముంది. కొందరు తెలుగు ప్రముఖుల చివరి మాటలు ఇవి.

నన్నయ్య చివరి పద్యం.

"శారద రాత్రు లుజ్జ్వల లసత్తర తారక హార పంక్తులం
జారుతరంబు లయ్యె వికసన్నవ కైరవ గంధ బంధురో
దార సమీర సౌరభ ము తాల్చి సుధాంశు వికీర్య మాణ క
ర్పూర పరాగ పాండు రుచి పూర ము లంబర పూరితంబులై"

"పాండురుచి పూర ములు + అంబర పూరితంబులై" అని విరవటానికి బదులు "పాండురుచి పూర ములన్ + పర పూరితంబులై" అని సంధి విశ్లేషించిన, చివరి మాట "పర పూరితంబులై" అవుతుంది.ఇక భారత రచన వ్రాయటం పొసగదు, అది పర పూరితం కాక తప్పదని సూచించడమా, లేక యాదృచ్ఛికంగా వెలువడిన పదగుంఫనమా? ఏదైనా చివరి మాటలో సైతం స్వారస్యం సాక్షాత్కరిస్తుంది.



PDF created with pdfFactory trial version www.pdffactory.com

కనకాభిషేకమందిన శ్రీనాథుడు అవసానదశలో పన్నులు కట్టలేక అవస్థలు పడుతూ కూడా
"కవిరాజు కంఠంబు కౌగిలించెను గదా
పురవీధి నెదురెండ పొగడదండ" అని,
"దివిజ కవి వరు గుండియల్ దిగ్గురనగ,
నరుగుచున్నాడు శ్రీనాథు డమరపురికి"
అన్న పదాలు కవిసార్వభౌముని అణుమాత్రం చెదరని ఆత్మస్థైర్యాన్ని, ఆత్మాభిమానాన్ని, రాజసాన్ని కళ్ళకు కట్టినట్టు చూపిస్తాయి.

పోతన చివరి మాట తెలియదు కానీ, దరిద్ర్యావస్థలో పండితుడొకరు బ్రౌను దొరగారికి గజేంద్రమోక్షంలోని "లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె.." అను పద్యాన్ని సాహాయ్యార్థమై పంపగా, బ్రౌను దొరగారు సమాధానంగా పోతనగారి

"ఏను మృతుండ నౌదునని యింత భయంబు మనంబు లోపలన్
మానుము సంభవంబు గల మానవ కోట్లకు జావు సిక్కమొ
గాన హరిం దలంపు మిక గల్గదు జన్మము నీకు ధాత్రిపై
మానవ నాథ! చెందెదవు మాధవ లోక నివాస సౌఖ్యముల్"

పద్యంతో పాటు కొంత సొమ్ము కూడా పంపారట. ఆ పద్యం పోతన గారి చివరి మాటకు సత్యదూరమనిపించదు.



PDF created with pdfFactory trial version www.pdffactory.com

అవసానదశలో తిరుపతి శాస్త్రిగారి మానసజిహ్వ ఈ పద్యం ఆలాపించింది.

"దయ యేమూలను దాగెనో, భవదుదాత్తంబైన మంత్రం బనా
మయదంబే మయి పోయెనో, యమల నామ ప్రాభవంబెందులో
వ్యయమై పోయెనొ దేవ! భక్తునకు సంప్రాప్తించునే మేహవా
ర్మయమీయామయ మెంత మోసమిది యౌరా! సూర్యనారాయణా!"

తరువాత వారు మాటాడలేదు, కన్ను మూసిరి.

కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, రవి కళాశాల అధిపతి సి.వి.యన్.ధన్ ఆయన్ను పరామర్శించడానికి వెళ్ళి "డాక్టర్లు ఏం భయంలేద"ని చెప్పారండీ అని విశ్వనాథవారితో అన్నారట. వెంటనే విశ్వనాథవారు "డాక్టర్లకేం భయం. చస్తానని నాకు భయం గానీ!"
అని అందరినీ నవ్వించిన కొద్ది సేపటికే మరణించారు.

మాటలెన్నుకోవచ్చు కాని చివరలను కాదు. ఎన్ని మాటలు చెప్పినా, మార్చినా, చివరి మాటెప్పుడూ ఒక్కటే.



PDF created with pdfFactory trial version www.pdffactory.com